# ఈ జ్యోతి ఆరదు

ఆ రోజు రామచంద్రమూర్తి మాష్టారు ఉషారుగా నిద్ర లేచారు.

కాలకృత్యాలు తీర్చుకుని, చన్నీళ్లస్నానం చేసి యోగాసనాలు వో అరగంట సేపు చేశారు.

మాఘమాసం మంచుతెరలను కప్పుకున్నట్లు తెల్లటి చొక్కా, ధోవతి వేసుకుని వరాండాలో పేము కూర్చీలో కూర్చున్నాడు శాంతమ్మ తీసుకువొచ్చే కాఫీ కప్పు కోసం, పేపరువాడి కోసం ఎదురు చూస్తూ.

కాఫీ కావాలని నోరు తెరిచి అడగడాయన. 'ఆకలవుంతుంది... అన్నం వొడ్డించు' అనడాయన. ఆయన భార్యే ఆయన అవసరాలు గమనిస్తూ వుంటుంది.

కాఫీ కప్పు అందుకుంటూ శాంతమ్మ వైపు అభిమానంగా, ప్రేమగా చూశారు. ఆయన పెదాలపైన చిరునవ్వు మెరిసింది. రెండు నిముషాల్లో కాఫీ తాగేశారు.

"ఈ రోజు ఎంతో ఉల్లాసంగా కన్పిస్తూన్నారే?" అంది శాంతమ్మ.

"స్కూల్లో గురుపూజోత్సవం చేస్తున్నారు ఈ వేళ. నాకు సన్మానం చెయ్యాలని వాళ్ళ ముచ్చట" కళ్ళ జోడు ధోవతి అంచుతో తుడుచుకుంటూ అన్నాడాయన.

"ఈ సన్మానాలు, గురుపూజలు వొరగబెట్టేది ఏముందండీ! మీరు రిటైరై రెండేళ్ళయ్యింది. పెద్ద వాడికి ఉద్యోగం లేదు. రెండోవాడు జులాయి వెధవలా చదువు సంధ్య లేకుండా తిరుగుతున్నాడు. అమ్మాయిలిద్దరూ పెళ్ళీడు కొచ్చారు. మీ పెన్షన్ యింట్లో సరుకులకే చాలడం లేదు. పెద్దాడికి ఉద్యోగ ప్రయత్నం గట్టిగా చెయ్యండి!"

ఆయన కాఫీ తాగకముందు ఆమె ఎప్పుడూ ఏ విషయం మాట్లాడదు. ఆమె నిష్ఠూరంగా

ఏదన్నా అంటే ఆయన కాఫీ తాగడు. అన్నం ముందు కూర్చున్నప్పుడు కూడా ఏ సమస్య గూర్చి మాట్లాడదు. ఆయన ఉల్లాసంగా వున్నప్పుడే తన గుండెల్లో బాధనంతా వెళ్ళగక్కుతుంది.

పెద్దవాడి ప్రసక్తి రాగానే ఆయన ముఖ కవళికలు మారాయి. పక్కింటి కనకయ్య చెప్పిన విషయం గుర్తుకురాగానే వొళ్ళు మండిపోయింది.

"నవీన్... నవీన్!" పెద్దగా కేకేశాడు.

తండ్రి పిలిచిన ఐదు నిముషాలకుగాని వరండాలోకి రాలేదు నవీన్. నోట్లో టూత్‌బ్రష్ పెట్టుకుని నిర్లక్ష్యంగా తండ్రి వైపు చూస్తూ నిలబడ్డాడు.

"నిన్న కనకయ్యగారి అమ్మాయిని అల్లరి పెట్టావంటా?"

"ఆ అమ్మాయి చెప్పిందా?" ఆ అమ్మాయి చెప్పివుండదనే ధైర్యంతో అన్నాడు.

నవీన్ సన్నజాజి పందిరి దగ్గర కనకయ్య కూతుర్ని ముద్దుపెట్టుకోవడం కనకయ్య కళ్ళలోనే పడింది. మరోసారి అలా జరిగితే వూరుకునేది లేదని చెప్పేశాడు కనకయ్య రామచంద్రమూర్తితో.

ఎప్పుడూ ఎవ్వరితో మాటపడని ఆయనకు తలకొట్టేసిన పర్యంతం అయ్యింది. రాత్రి బాగా పొద్దు పోయాక నవీన్ ఇంటికి రావడంతో ఉదయం కొడుకును మందలించ వచ్చులే ననుకున్నాడు.

"నీ సిగ్గులేని పనులు ఆ అమ్మాయి కూడ వూళ్ళో చాటింపు వెయ్యాలి?"

'నీరజను నేను ప్రేమించా! ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాను"

"డిగ్రీ పూర్తి చేసి మూడేళ్ళయింది. చిన్న ఉద్యోగం సంపాదించుకోలేకపోయావ్! నీకు తోడు వో పెళ్ళాం! వెధవ పనులు చేస్తూ బతికేకన్నా నూతిలో పడి చస్తే పీడ విరగడై పోతుంది" కొడుకు చెప్పిన మాట వినడం లేదనే ఆవేదనతో కోపంగా అనేశాడాయన.

నవీన్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నేనేం వెధవ పని చెయ్యలేదు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకనప్పుడు నన్నేం చెయ్యమంటారు" అంటూ కళ్ళు తుడుచుకుని లోపలికి వెళ్ళాడు నవీన్.

తండ్రి కొడుకుల మధ్య రోజూ వుండే గొడవేననుకుంటూ వంటపని చూడటానికి లోపలికి వెళ్ళింది శాంతమ్మ.

ఉత్తరీయం భుజంపై వేసుకుని స్కూలువైపు నడిచాడు రామచంద్రమూర్తి.

భుజాన బ్యాగ్ తగిలించుకుని ఎదురొచ్చిన క్రాంతి రెండో కొడుకు వైపు తీక్షణంగా చూశాడు.

"రాత్రి తెనాలిలో డ్రామా కాంపిటీషన్స్ వున్నాయి నాన్నా! మళ్ళీ రేపు రేపల్లె వెళ్ళాలి' ' అనేసి తండ్రి వైపు మళ్ళీ చూడకుండానే వెళ్ళిపోయాడు క్రాంతి.

ఎన్ని కలలు కన్నాడు? తన కొడుకులు ముత్యాలని మురిసి పోయాడు. నూతన శకానికి నాంది పలకాలని, నవచైతన్యం వెల్లివిరయాలని పెద్దకొడుక్కి 'నవీన్' అని పేరు పెట్టుకున్నాడు. తమ చూడకపోయినా కనీసం తన కొడుకయినా సమసమాజం చూస్తాడనే ఆశతో రెండో కొడుక్కి 'క్రాంతి' అని పేరు పెట్టుకున్నాడు.

కూతుళ్ళు కూడ తన పేరు నిలబెట్టేట్లు లేరు. పెద్ద కూతురు మొన్న కూరగాయల కొట్టు దగ్గర ఎవరో కుర్రాడితో చనువుగా మాట్లాడటం గమనించేడు. తనను చూడగానే బెదిరి పారిపోయాడు కుర్రాడు.

క్రమశిక్షణ తోనే పెంచాడు పిల్లల్ని తను. ఇంట్లోనుంచి బయటకు రానిచ్చేవాడుకాదు. తెల్లవారు ఝూమున నాల్గింటికే పిల్లల్ని లేపి చదివించేవాడు. ఏ చిన్న తప్పుచేసినా సహించే వాడు కాదు తను.

కానీ ఏం లాభం?

పదో తరగతి పూర్తయ్యేవరకే తనకు భయపడ్డారు. కాలేజీ చదువుల్లో పడగానే పూర్తిగా మారిపోయ్యారు. తనంటే లెక్కలేని తనం... మొండి తనం... నిర్లక్ష్యం వాళ్ళలో చోటు చేసుకున్నాయి.

ఎంతమంది పిల్లలు తనదగ్గర చదువుకోలేదు! పాతికమంది దాకా పిల్లలు యింటిదగ్గర చేరేవాళ్ళు. ఉదయాన్నే ఇంగ్లీషు గ్రామరు, లెక్కలు చెప్పేవాడు.

రాత్రిపూట తొమ్మిందింటి దాకా చదివించేవాడు. వొక్కరి దగ్గర కూడా పైసా తీసుకొని ఎరుగడు.

అన్ని దానాల్లో విద్యాదానం గొప్పదనుకునేవాడు.

...కొవ్వొత్తిలా వెలుగుతూ చుట్టూ వున్నవాళ్ళకి వెలుగు నివ్వాలనుకునేవాడు. అదే తాపత్రయంతో తను కరిగిపోతున్నా లెక్కచేసేవాడు కాదు...

"ఎక్కడి దాకా మాష్టారు?"

రాఘవయ్య పలుకరించాడు.

....రాఘవయ్య కొడుకు స్కూలు ఎగ్గొట్టి తిరుగుతుంటే వాడికి మంచిమాటలు చెప్పి శ్రద్ధగా స్కూలుకువొచ్చేటట్లు చేశాడు తను. రోజూ ఇంటి దగ్గర వాడిని దగ్గర కూర్చోబెట్టుకొని చదివించేవాడు. వాడిప్పుడు సౌత్ సెంట్రల్ రైల్వేస్‌లో బ్రిడ్జి ఇనస్పెక్టరు. మొన్నీమధ్య వాడి పెళ్ళి పందిరి దగ్గర తనకు బట్టలు పెట్టి నూతన వధూవరులు తనకు నమస్కారంచేశారు.

నలుగురి ముందు తనకు ఎంత గౌరవం?

ఎంతగానో ఉప్పొంగి పోయాడు తనలోని ఉపాధ్యాయుడిని గౌరవించినందుకు.

వాళ్ళ అబ్బాయిని బిట్రగుంట ట్రాన్స్‌ఫర్ చేశారట ఆ విషయం చెప్పి వెళ్ళిపోయాడు రాఘవయ్య.

నాలుగు బజార్లు తిరిగి స్కూలు దగ్గరకొచ్చాడు గేటు దగ్గర 'వెల్‌కం' బోర్డు కట్టిస్తూ హెడ్‌మాస్టరు కన్పించాడు.

"అప్పుడే వొచ్చేరేం మాస్టారూ? పదకొండు గంటలకు గదా మీ సన్మానం" అన్నాడు హెడ్ మాష్టరు.

ఆ మాట ఎందుకన్నానా అని నోరుకరుచుకున్నాడు. రామచంద్రమూర్తిగారు ఎక్కడ బాధపడతారోనని మళ్ళీ క్షమాపణ చెప్పుకున్నాడు.

"ఇంటిదగ్గర ఏం తోచక వొచ్చాను లెండి. మీ పనులు కానివ్వండి. నేను స్టాఫ్‌రూములో కూర్చుంటాను" అనేసి స్టాఫు రూముకేసి నడిచాడు రామచంద్రమూర్తి.

రిటైరైనాక కూడ రోజూ స్కూలుకు వచ్చి వో గంట అక్కడ కాలక్షేపం చెయ్యకపోతే ఆయనకు నిద్రపట్టదు. స్కూలుకు ముందున్న పార్కులో గాంధీ విగ్రహం దగ్గర కూర్చుంటే అన్ని సమస్యలు మర్చిపోతాడాయిన.

ఊహ తెల్సినప్పటినుండి తనకీ ఈ స్కూలుకు బంధం వుంది.

చిన్నప్పుడు గోలీకాయలు ఆడింది ఈ స్కూలు దగ్గరే.

అక్షరాలు నేర్చుకుంది ఈ స్కూల్లోనే "దేశ భవిష్యత్తు మలచబడేది క్లాసు గదుల్లోనే" అంటూ పాఠాలు చెప్పింది ఇక్కడే.

ఎంతోమంది డాక్టర్లు, ఇంజనీర్లు, ప్లీడర్లు, విద్యావేత్తలు కావడానికి పునాదులు వేసింది ఈ స్కూల్లోనే.

"ఊరంతా మారిపోయింది గాని మన స్కూలు రూపురేఖలు ఏ మాత్రం చెక్కుచెదరలేదు.

మాష్టారూ! అవే పూరిపాకలు, పాతగోడలు, వెలిసిపోయిన గాంధీ గారి విగ్రహం, విరిగిపోయిన కుర్చీలు బల్లలు. ఈ స్కూలు మీద పెట్టుబడి పెడితే ఏం లాభం వొస్తుందనుకుంటాడు మన కరస్పాండెంటు గారు" అన్నాడు స్టాఫు రూములో కూర్చుని పిల్లల నోటు పుస్తకాలు దిద్దుతున్న హిందీ పండిట్.

ఆ హిందీ పండిట్‌కు స్కూలు కరస్పాండెంటుకు ఎప్పుడూ పొట్లాటే. టీచర్ల జీతాలు క్రమంగా యివ్వకపోవడం, స్కూలు బాగోగులు పట్టించుకోకుండా స్కూలు గ్రాంట్ స్వాహా చెయ్యడం, టీచర్లను సొంత పనులకు ఉపయోగించుకోవడం, తన విధేయులు స్కూలుకు రాకపోయినా పట్టించుకోకపోవడం చేస్తూవుంటాడు ఆ కరస్పాండెంటు. వో సారి హిందీ పండిట్‌కు మెమో యిస్తూ కావాలనే 'టి' అనే ఇంగ్లీషు అక్షరం టైపు కొట్టించకుండా యిచ్చాడు. దాంతో భగ్గున మండిపోయాడు హిందీ పండిట్. మేనేజ్‌మెంట్ ఆకృత్యాలు డి.యి.వో. కు విన్నవించడం, డి.యి.వో. కరస్పాండెంటు దగ్గరగ లంచం పుచ్చుకుని వాళ్ళిద్దరూ వొకటై పోవడంతో విసిగిపోయాడు హిందీ పండిట్.

హిందీ పండిట్ చెప్పినదంతా విని నవ్వి వూరుకున్నాడు రామచంద్రమూర్తి.

ఈ వ్యవస్థ స్వరూపం మారి సమసమాజం ఏర్పడితే తప్ప ఈ రుగ్మతలన్నీ తొలిగిపోవనుకున్నాడాయన.

మీటింగ్ మొదలవుతున్నదని అటెండరు నోచ్చి చెప్పడంతో హెడ్ మాస్టరు రూముకు వెళ్ళాడు రామచంద్రమూర్తి. అప్పటికే స్కూలు కరస్పాండేంటు, సమితి అధ్యక్షుడు, వూళ్ళో పేరుమోసిన డాక్టరుగారు కూర్చున్నారక్కడ. వాళ్ళందరి కాఫీ, టిఫిను పూర్తయ్యాయి. రామచంద్రమూర్తి గారిని పట్టించుకున్నవాళ్ళు లేరు.

మీటింగ్ మొదలయ్యింది.

ఊళ్ళో పెద్దలు, స్కూలు పిల్లలు వేదికముందు కూర్చున్నారు.

వేదిక నలంకరించిన కరస్పాండెంటు, సమితి అధ్యక్షుడు, డాక్టరుగారు 'సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర' గూర్చి సుదీర్ఘంగా ఉపన్యాసాలు చేశారు.

చీటికి, మాటికీ టీచర్లను ట్రాన్స్‌ఫర్ చేసే సమితి అధ్యక్షుడు, టీచర్ల సంక్షేమం పట్టించుకోని కరస్పాండెంటు, డబ్బులు పిండి పేదప్రజల రక్తం జలగలా తాగే డాక్టరుగారు ఉపాధ్యాయుల కర్తవ్యం గూర్చి మాట్లాడుతుంటే రామచంద్రమూర్తి గార్కి, హిందీ పండిట్‌కు నవ్వొచ్చింది.

చివర్లో రామచంద్రమూర్తి గార్కి సన్మానం, గురుపూజ.

సమితి అధ్యక్షుడు పూలదండ వేసి, ఆయనకు దుశ్శాలువ కప్పారు.

కరస్పాండెంటు, డాక్టరుగారు పోటీపడి రామచంద్రమూర్తిగారిని పొగిడారు.

సన్మానం జరుగుతున్నప్పుడు ఆయన వొళ్ళు పులకరించలేదు. వొంటిమీద తేళ్ళు జెర్రులు పాకుతున్నట్లనిపించింది. ఈ సన్మానానికి ఎందుకు వొప్పుకున్నానని బాధపడ్డాడు.

... చీడ పురుగుల చేత సన్మానం చేయించుకోవడమేమిటి తన పిచ్చిగాని...

'...టీచర్స్ డే' సార్థకం కావాలంటే ముందు పాఠశాలల పరిస్థితి మెరుగవ్వాలి... ఉపాధ్యాయులే సమాజానికి వెన్నెముకలని అందరూ గుర్తించాలి... ఉపాధ్యాయ వృత్తికి ఉపాధ్యాయులు అంకితం కావాలి... అప్పుడే నిజమైన గురుపూజోత్సవం...

ఎవరో వొచ్చి రామచంద్రమూర్తి చెవిలో ఏదో చెప్పారు.

తనకు వేసిన పూలదండ, శాలువా అక్కడే వదిలేసి కంగారుగా వెళ్ళిపోయారు రామచంద్రమూర్తి.

ఇంటికి వొచ్చేసరికి అప్పటికే అంతా అయిపోయింది.

కొనవూపిరితో వున్న నవీన్ కళ్ళు మూశాడు.

ఉదయం తండ్రి అన్నమాటలకు కుంగిపోయి కిరోసిన్ మీద గుమ్మరించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు నవీన్.

వొళ్ళంతా కాలిపోయి నల్లగా వికృతంగా వున్న కొడుకు శరీరాన్ని చూసి తల్లడిల్లిపోయాడు రామచంద్రమూర్తి.

తనకెక్కడ చెడ్డపేరు తీసుకొస్తాడోనన్న ఆదుర్దాలో కొడుకును కోప్పడ్డాడేగాని యిలా తెగిస్తాడని ఆయన కల్లో కూడా అనుకోలేదు.

కొడుకేదో కసితో తనమీద కత్తిగట్టినట్లు ఈ పనికి పాల్పడ్డాడు గాని అన్నేళ్ళు కష్టపడి పెంచిన తండ్రి మనస్సెంత గాయపడుతుందో నవీన్ ఆలోచించలేదనిపించింది. అతను చేసినపని న్యాయమనిపించలేదు ఆయనకు.

...ఓడిపోయాడు తను....

....జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు చూశాడు. తను... కానీ ఇది భయంకరమైన ఓటమి... ఎంతో మందిని సమాజానికి ఉపయోగపడేటట్టు తీర్చిదిద్దాడు... చదువురాని మొద్దులని వొదిలేసిన వాళ్ళన్ను కూడా ఓపిగ్గా కూర్చోబెట్టికొని పాఠాలు చెప్పి వాళ్ళు ప్రయోజకులయ్యేటట్లు చేశాడు. కానీ ఆ శ్రమ తనకు ఉపయోగపడలేదు...

ఆయన కనుగొలకుల్లో నీళ్ళు నిలచాయి.

జీవితంలో ఎప్పుడూ ఏడ్వని ఆయన మొదటిసారిగా చిన్నపిల్లాడిలా భోరుమని ఏడ్చేశాడు.

వారం రోజులు గడిచాయి.

రామచంద్రమూర్తిగారు ఇంకాపూర్తిగా దుఃఖంలో నుంచి తేరకుకోలేదు.

వీధి అరుగుమీద కూర్చుని శూన్యంలోకి చూస్తూ వుండి పోయాడు.

ఎదురుగా నిలబడివున్న వ్యక్తి పలుకరించినా మాట్లాడే మనస్థితిలో లేడాయని. పలుకరించిన వ్యక్తిని గుర్తుపట్టలేక సతమతమవుతూ పక్కనే కూర్చోమని సైగచేశాడు.

“నేను మాస్టారూ! రామాన్ని. విశ్వనాథం గారి అబ్బాయిని. చిన్నప్పుడు మీ దగ్గర చదువుకున్నాను. ‘ఏంజిల్’ అనే మాటను తప్పుగా ‘ఎంగిల్’ అని చదివితే నవ్వేవాళ్ళు. నన్నెప్పుడూ ‘ఎంగిల్’ అని పిలిచెవాళ్ళు మీరు.”

అతన్ని గుర్తుపట్టాడు.

“మా ఆరుగురు అన్నదమ్ములం మీ దగ్గరే చదువుకున్నాం. మా తమ్ముడు ఐ.పి.యస్. కు సెలెక్టయి ట్రైనింగ్‌లో వున్నాడు. నేను వ్యాపారంలో లక్షలు లక్షలు గడించాను. మేము కాకినాడ వెళ్ళి అక్కడ సెటిలై పద్దెనిమిదేళ్ళు అయినా ఎప్పుడూ మిమ్ముల్ని అందరం తలుచుకుంటూ వుంటాం. నాకు మా వూరి దగ్గర ఆశ్రమ పాఠశాల పద్ధతిలో స్కూలు నడపాలని వుందండీ! ఉత్తమ ఆశయాలతో స్కూలు నడపడం వ్యాపారంలో మునిగి తేలేనాకు వీలుపడదు. మీరు గుర్తుకొచ్చారు....మీరే కరస్పాండెంటు, ప్రిన్సిపాల్ ఆ స్కూలుకి. స్కూలు వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకోను. పూర్తిగా మీ ఆజమాయిషీలోనే వుంటుంది. మీ ఆశయాలు నెరవేరడానిసి ఈ స్కూల్‌ని వేదికగా మార్చుకోండి.”

రామం మాటలు పన్నీటి జల్లుల్లా ఆయన హృదయంపై కురిశాయి.

ఏం మాట్లాడాలో తోచక మౌనంగా తలూపేడు రామచంద్రమూర్తి. *

**(ఉదయం 18-6-1987)**